కవితా కౌముది

తాత్త్విక దర్శనం

పి.వి.ఎస్.కృష్ణకుమారి

నిజం తెలియనప్పుడు
అనుమానాలు స్వైరవిహారం చేస్తాయి
వికటాట్టహాసం చేస్తూ,
మనసులని ఛిద్రం చేస్తాయి.!
ఆధారాలు కొరవడితే
ఊహలతో ఎన్ని కథలైనా అల్లవచ్చు
ఆ ఊహల సాలెగూడులో చిక్కుకుని
బయట పడే దారే కనిపించదు..!
ఎడారిలో దిక్కు తెలియని
బాటసారి పయనంలా
ఎటో పోతుంటాయి ఊహలు
సత్యాలు బరువైన శిలల వలే
భయమనే నీటి అడుగున మునిగిపోగా
అసత్యం తెల్లని నురుగై
పైపైకి తేలుతూ విర్రవీగుతుంది..!
అదొక నయగారా జలపాతమై
రారమ్మని ఆహ్వానించి
మోహంలో ముంచేస్తుంది
నిజం స్వచ్ఛమైన సెలయేరులా
పయనం సాగిస్తుంటే
అబద్ధం బొగరుతో దుమికే జలపాతమై
ముంచెత్తుతుంది!
నిజానికి వీచే గాలి గుసగుసలు
ప్రత్యక్షసాక్షం అయితే
ఆ భాష అర్థమయ్యేది ఎందరికి?
కానీ.....
సూర్యకాంతికి మేఘాల అడ్డు క్షణికమేగా!
అబద్ధం మట్టిగోడ నిర్మాణమైతే
ఎప్పటికైనా కూలిపోవాల్సిందేగా!
దురదృష్టం ....
కూలిన గోడలకింద అశువులు బాసేది ఎందరో!
అయితే...
కాలం గడిచేకొద్దీ
వారే నిజానికి పునాదులు
ఒక సత్యం విజయం
సాధించాలంటే
ఇలాంటి బలిదానాలు తప్పవు
కానీ....
సత్యానికి ప్రతిఫలం బలిదానమా
అనే భయం అవసరం లేదు..!!



నిజం భూమిలో సమాధి అయినా,
సమయం వచ్చినప్పుడు
పుడమిని చీల్చుకుని వచ్చే
పదునైన వెదురు బద్దలా
బయటికి వస్తుంది..!

వివేకం అనే హంస
సత్యాన్ని, అసత్యాన్ని
పాలూ,నీరులా విడదీసి
తాత్విక దర్శనం చేయగలిగితే
తాత్కాలికమై, భ్రమతో కూడిన
అసత్యం నీరులా ఇంకి పోతుంది..!

దీనికి యోగులే కావలసిన పనిలేదు
విశ్వ విజ్ఞానం ఉంటే చాలు

సత్యమనే పాల సముద్రం
మన ముందు సాక్షాత్కరిస్తుంది..!

★★★

దుస్తబ్ధం

డా.గాదిరాజు మధుసూదన రాజు

అపార్థపు చిచ్చు
అనర్థపు ఉచ్చు
భేధాభిప్రాయపు గాయం
వెటకారపుటవమాన హేయం

చిట్టడవికి నట్టనడుమ
రేగిన కొలివికర్ర

ఆనకట్టకు నిట్టనిలువున
చీలిన చిరునెర్రె

అజ్ఞేయం గా
తూష్ణీం భావించిన
నిర్లక్ష్యం.. ఆగ్నేయ మై
భీభత్సం సృష్టించ వచ్చు!

మౌనం? నిశ్శబ్దం?

దుస్సబ్ధమై
మేథస్సును నిర్మానసం చేసి
అమానుషం గావించి
నిర్మానుష్య భూలబ్ధ మై
ఉనికిని ఊడ్చేయవచ్చు!!

మానేసు కోకు
విచక్షణా స్పృహల్ని మరీ
చూసీ చూడనట్లు

చెలరేసుకోకు
రక్షణా వ్యూహాల్ని సదా
మోసపోయేట్లు

★★★★

లంకె

భమిడిపాటి స్వరాజ్య నాగరాజారావు

తీగ లాగితే డొంక కదిలినట్లు,
పదం దొరికితే కవిత మెదులుతుంది.
హలం కదిలితే పొలం సాగయినట్లు,
ఆలోచన దొరలితే కవిత సాగుతుంది.
కనులు తెరిచితే చూపు ప్రాకినట్లు,
మనసు తరచితే భావం ఎదుగుతుంది.
గాలి తాకితే ఆకు కదిలినట్లు,
భావం మెదిలితే భాష ఒదుగుతుంది.
కాలు కదిలితే దారి ఏర్పడినట్లు,
కలం కదిలితే కవిత ఒలుకుతుంది...!!

★★★

నీవు అడగకపోవచ్చు

ఆచాళ్ళ శ్రీనివాసరావు

ఎప్పుడు ఏ పాటని నేను ఎవరికి సమర్పించానో
నీవు అడగకపోవచ్చు...
తనని సగౌరవంగా స్వీకరించగలిగే అర్హులైన ఎవరికోసమో
దొరలోని దుమ్ము లో అది ఇంకా అలాగే పడి ఉంది.
ఆ ఎవరో నువ్వేనా?
నువ్వు నిజంగా నా మాటలు విన్నావా?
నీవు వాటిని హృదయానికి హత్తుకున్నావా?
నేను నీ పేరైనా తెలియని వాడినే కావచ్చు
కానీ నా ఆలోచనల సమస్త సారాన్నీ అర్పిస్తున్నది
నీకు మాత్రమే...!

★★★

రసరేఖలు

శ్రీధర్ బచ్చోటి

అందమన నీవె యానందమనగ నీవె
కనులకింపైన రూపును కనుటయందు
మనసు పరితోషమును చవిగొనుటయందు
కలుగు ప్రేమానుభూతివే చెలియ నీవు

నీ ముఖొబ్జమ్ము వేయి వెన్నెలల వెలుగు
నీ మనోస్ఫటికమ్ము సుస్నిగ్ధతరము
అందమానందములను నీయందు గలిగి
అందజేయుదువత్యద్భుతానుభవము

నీవపుశ్శుభరేఖలే నా వెలుంగు
నీదు ప్రేమయే నాశ్వాస నాదు బ్రతుకు
చెలియ! నా మనసు తనువు జీవితమ్ము
నీ కొరకె యర్పణము చేయ నిలచియుంటి

సార్థకము జన్మ నీ సాహచర్యమంది
ధన్యమీ బుద్ధి నిను నిల్పి ధ్యానమందు
ఎన్నడైనను నూహనందేని నన్ను
పరిహరించని నీవొక వరము నాకు

నడచిపోవుదము విరుల నడవలందు
విహగ మార్గముల మెయిలు వీధులందు
అంతరిక్షాన తారల పుంతయందు
ఐక్యమైపోదమానందమతిశయింప

COMMENTS